నేడు పెన్షన్ల పంపిణీకి రూ.113.24 కోట్లు సిద్ధం

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు : జిల్లాలో అక్టోబరు 1వ తేదీన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను రెండు లక్షల 64 వేల 966 మందికి రూ.113.24 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అక్టోబర్ మాసపు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ అక్టోబర్ ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుండి ప్రారంభమవుతుందని, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను అందిస్తారన్నారు. ఒకటో తేదీనే నూరు శాతం పెన్షన్ల పంపిణీకి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామని చెప్పారు. అనివార్య కారణాలతో ఒకటో తేదీన పెన్షన్ తీసుకోనివారికి మూడో తేదీన అందిస్తారన్నారు. ఎక్కడా ఏ ఒక్క పొరపాటు జరగకుండా పింఛన్ల పంపిణీ జరగాలన్నారు.

కాల్‘మనీ’ కలకలం..!

ఏలూరు నగరంలో కాల్‌మనీ వ్యాపారం జడలు విప్పింది. సామాన్య ప్రజానీకాన్ని వడ్డీల పేరుతో పీక్కుతింటున్నారు. ఇంట్లో మహిళలను తీవ్రంగా అవమానపరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రూ.వేలల్లో తీసుకున్న అప్పుకు రూ.లక్షల్లో వడ్డీ కట్టినా ఇంకా తీరకపోవడంతో బాధితులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కాల్‌మనీ బాధలు తట్టుకోలేని బాధితులు రోడ్డెక్కి ఎంఎల్‌ఎ బడేటి చంటిని, పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగుచూసింది. కాల్‌మనీ వ్యాపారం సాగిస్తున్న మేడపాటి సుధాకర్‌రెడ్డి, ఆయన అనుచరులపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను ఈ బాధల నుంచి కాపాడండని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

- ఏలూరు నగరంలో జడలు విప్పిన కాల్‌మనీ వ్యాపారం
- సామాన్య ప్రజానీకమే టార్గెట్‌గా దందా
- రూ.25 వేల అప్పుకు రూ.ఐదు లక్షలు కట్టినా ఇంకా తీరని వైనం
- ప్రతి మంగళవారం వడ్డీ సొమ్ము కట్టకపోతే నరకయాతనే
- మహిళలపై దౌర్జన్యం, అసభ్య పదజాలంతో దూషణలు
- ఎంఎల్‌ఎ బడేటి చంటి ఆధ్వర్యంలో ఎస్‌పిని కలిసిన 30మందికిపైగా బాధితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు స్పోర్ట్స్, సిటీ

రెక్కాడితేగాని డొక్కాడని సామాన్య ప్రజానీకాన్ని కాల్‌మనీ వ్యాపారులు జలగల్లా పీక్కుతుంటున్న వైనం ఏలూరు నగరంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మేడపాటి సుధాకర్‌రెడ్డి, ఆయన అనుచరులుగా ఉన్న మహ్మద్‌అఖిల్ రెహ్మాన్, గూడవల్లి విద్యాసాగర్, రాజేష్, లావణ్య కాల్‌మనీ పేరుతో సాగిస్తున్న దందా తెలిసి నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏలూరు నగరంలో రోజువారీ పనులు చేసుకునేవారు, చిరుద్యోగులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని టార్గెట్‌గా చేసుకుని కాల్‌మనీ వడ్డీ వ్యాపారాన్ని మేడపాటి సుధాకర్‌రెడ్డి తన అనుచరులతో చాలాకాలంగా సాగిస్తున్న తీరు బాధితులు రోడ్డెక్కడంతో బయటపడింది. కాల్‌మనీ పేరుతో సుధాకర్‌రెడ్డి సాగిస్తున్న దురాగతలను బాధితులు ఒకొక్కటిగా చెబుతూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తీసుకున్న అప్పునకు ప్రతి మంగళవారం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అవసరాన్ని బట్టి వడ్డీ అనేది నిర్ణయిస్తారు. రూ.70 వేలు అప్పుగా తీసుకుంటే వారానికి రూ.25 వేలు వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ.25 వేలు అప్పు తీసుకుంటే వారానికి రూ.వెయ్యి వడ్డీ కట్టాలి. వచ్చిన వారి అవసరాన్ని బట్టి వడ్డీ అనేది నిర్ణయం ఉంటుందని బాధితులు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం ఏడుగంటల్లోపు వడ్డీ కట్టకపోతే రెట్టింపు సొమ్ము కట్టాల్సి ఉంటుందని, ఎదురు ప్రశ్నిస్తే ఇష్టానుసారంగా మాట్లాడి హింస పెడతారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎస్‌పికి ఇచ్చిన ఫిర్యాదులో అనేక అంశాలను బాధితులు వివరంగా తెలిపారు. అప్పు తీసుకున్న వారి నుంచి ఐదు ఖాళీ ప్రామిసరీ నోట్లు, వంద రూపాయల స్టాంప్ పేపర్లు రెండు, సంతకాలు పెట్టిన తెల్ల కాగితాలు రెండు తీసుకుంటారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇచ్చిన అప్పునకు వసూలు చేస్తున్న సొమ్ముకు అసలు సంబంధం ఉండదని చెబుతున్నారు. వడ్డీలు కట్టకపోతే ఇళ్లకు వచ్చి భార్యలను, ఇంట్లో పిల్లలను అసభ్య పదజాలంతో బెదిరింపులకు పాల్పడతున్నారన్నారు. భర్తలు ఇంటి దగ్గర లేని సమయంలో రాత్రి ఎనిమిది గంటల నుంచి పది గంటల మధ్యలో వచ్చి లైంగిక దాడులు చేస్తారని బాధితులు ఫిర్యాదులో తెలిపారు. కొంతమంది వైసిపి చోటా నేతలతో కలిసి ఇళ్లపైన దాడులు చేస్తున్నారన్నారు. భౌతికదాడులకు పాల్పడతారని, వీరి ఆగడాలు భరించలేక కొంతమంది ఆత్మహత్యకు పాల్పడినట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది వేరే ప్రాంతాలకు వెళ్లిపోయి కూలి పనులు చేసుకుంటూ తల దాచుకుంటున్నట్లు చెబుతున్నారు. కొంతమంది అనారోగ్యం పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపారు. అప్పు కట్టకపోతే ఉన్న ఆస్తులను బలవంతంగా రాయించుకుంటున్నట్లు బాధితులు చెబుతూ ఆవేదనకు గురవుతున్నారు. దేవాలయాల్లోని అర్చకులు సైతం వీరి బాధితులుగా ఉండటం గమనార్హం.

ఎంఎల్‌ఎ ఆధ్వర్యంలో ఎస్‌పికి ఫిర్యాదు

కాల్‌మనీ బాధితులంతా ఆదివారం రాత్రి ఎంఎల్‌ఎ బడేటి చంటిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం ఎంఎల్‌ఎ చంటి బాధితులందరినీ తీసుకుని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌ను కలిసి ఫిర్యాదు ఇప్పించారు. కాల్‌మనీ వేధింపులపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ ఎస్‌పిని కోరారు. కాల్‌మనీ బాధితులు దాదాపు 30 మంది ఎస్‌పిని కలిసిన వారిలో ఉన్నారు. సమస్య తీవ్రమైంది కావడంతో బాధితుల నుంచి పోలీసులు విడివిడిగా ఫిర్యాదులు తీసుకుంటున్నారు. ఏలూరు డిఎస్‌పి కార్యాలయంలో బాధితులంతా విడివిడిగా ఫిర్యాదులిచ్చారు. పోలీసులు విచారణ చేపట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

రూ.70 వేలు తీసుకుని ఇప్పటి వరకూ రూ.12 లక్షలు వడ్డీ కట్టాను..

మైలవరపు నాగేశ్వరశర్మ, ఏలూరు దక్షిణపు వీధి

నేను అర్చకత్వం చేస్తాను. అవసరం నిమిత్తం 2019లో మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్ద రూ.70 వేలు అప్పు తీసుకున్నాను. వారానికి రూ.25 వేలు వడ్డీ కట్టాలన్నారు. 2023 డిసెంబర్ నాటికి రూ.12 లక్షలు వడ్డీ రూపంలో చెల్లించాను. ఇంక కట్టలేకపోయాను. తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారు. పోలీసులు తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

మహిళల దగ్గర అసభ్యంగా మాట్లాడతారు

అయిలూరి రాజేష్ శర్మ, ఏలూరు, కాల్‌మనీ బాధితుడు

మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్ద అవసరం నిమిత్తం రూ.లక్షా 20 వేలు అప్పు తీసుకున్నాను. 2021 నుంచి 2024 జనవరి వరకూ రూ.ఎనిమిది లక్షల 51,900 వడ్డీ రూపంలో కట్టాను. వడ్డీ సొమ్ము మొత్తం ఫోన్‌పే ద్వారానే చెల్లించాను. వివరాలు సైతం ఉన్నాయి. తెల్లకాగితాలపై, ప్రామిసరీ నోట్లపై సంతకాలు తీసుకున్నారు. వడ్డీ కట్టడం ఆలస్యమైతే ఇంటికొచ్చి మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తారు. న్యాయం చేయాలని కోరుతున్నాం.

రూ.25 వేల అప్పుకు రూ.5 లక్షల వడ్డీ కట్టాం

నాగదుర్గాలక్ష్మి, ఏలూరు, కాల్‌మనీ బాధితురాలు

మా ఆయన పౌరోహిత్యం చేస్తారు. 2021లో రూ.25 వేలు అప్పుగా తీసుకున్నాం. వారానికి వడ్డీ రూ.వెయ్యి చెల్లించాలన్నారు. ఆలస్యమైతే రెట్టింపు వడ్డీ వసూలు చేసేవారు. ఇప్పటి వరకూ రూ.ఐదు లక్షలు వడ్డీ కింద కట్టడం జరిగింది. డబ్బులు సకాలంలో చెల్లించకపోతే వారి పెట్టే బాధలు భరించలేనివిగా ఉంటాయి.

‘సూపర్ సిక్స్’ అమలు చేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి వంద రోజులైనా ఎన్నికల మేనిఫెస్టో అమలులో విఫలమైందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. లడ్డూ పేరుతో ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచే విధంగా వ్యవహరించకూడదని ఆయన హితవు పలికారు. సోమవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసి ఆమోదించారు. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు ప్రభుత్వం ప్రకటించిన వరద సహాయం కంటి తుడుపు చర్యగా ఉంది తప్ప, బాధితులను ఆదుకునే సహాయం కాదని విమర్శించారు. భవిష్యత్తులో వరదల నివారణకు తీసుకున్న శాశ్వత పరిష్కార చర్యలేమిటో ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో జిల్లాకు ఒకటి చొప్పున ప్రకటించిన మెడికల్ కాలేజీల్లో ఏలూరు జిల్లాకు కూడా ఒక మెడికల్ కాలేజీ ప్రకటించారని, అయితే మెడికల్ కాలేజీ నిర్వహణ పిపిపి విధాన ప్రకారం ప్రయివేటీకరణగా ప్రకటించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రయివేట్ కోటాలో మెడికల్ సీట్లు అమ్ముకుంటారని, ఈ విధానం విద్యార్థులకు చాలా ప్రమాదకరం, నష్టదాయకమని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కొత్త మద్యం పాలసీ గత వైసిపి ప్రభుత్వ విధానం కంటే గొప్పగా ఏమీ లేదని తెలిపారు. ప్రభుత్వం దీనిని కేవలం ఆదాయ వనరుగా చూస్తుందన్నారు. ఎపి అంటే అమరావతి, పోలవరం అని చెప్పిన చంద్రబాబు పోలవరానికిగాని, అమరావతికిగాని కేంద్ర ప్రభుత్వం నుంచి తెచ్చిన నిధులేమీ లేవని విమర్శించారు. అమరావతికి ప్రపంచబ్యాంకు నుండి రూ.15 వేల కోట్లు అప్పుగా వచ్చిందే తప్ప కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించి ఇచ్చిందేమీ లేదని అన్నారు. గతంలో తెలుగుదేశ ప్రభుత్వం ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గి అప్పులు చేసిన సంగతి తెలిసిందేనని, మరి ఈ రూ.15 వేల కోట్లు ఏ షరతులకు అంగీకరించి తీసుకున్నారో ప్రజలకు తెలపాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు రూ.30 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇవ్వనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం మరి నిర్వాసితుల నష్టపరిహారం, పునరావాస కాలనీల నిర్మాణం ఊసెత్తకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పంట నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా వైరల్ జ్వరాలతో ప్రజలు ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యానికి బాధపడుతున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సిల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేయాలని, అన్ని రకాల టెస్టులు ఉచితంగా చేయాలని ఆయన కోరారు. అక్టోబర్ 4న ఉచిత ఇసుక సమస్య, ఇతర ప్రజా సమస్యలపై ఏలూరు కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా చేపడుతున్నామని రవి తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, ఎం.నాగమణి, జి.రాజు పాల్గొని మాట్లాడారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, తెల్లం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కారాదు

స్పష్టమైన పరిష్కారం చూపాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్)లో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ డి.పుష్పమణి, ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కరరావు, ఎం.ముక్కంటితో కలిసి ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారుల నుంచి స్వీకరించే వినతులపై తక్షణ పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని, అసంతృప్తితో అర్జీలు రీఓపెన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల వద్దకే కలెక్టర్

పిజిఆర్‌ఎస్ వేదిక వద్దకు వెళ్లలేని వృద్ధులు, విభిన్నప్రతిభావంతులను కిందనే ప్రత్యేకంగా వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి వారి వద్దకే కలెక్టర్ వచ్చి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అందిన అర్జీల్లో కొన్ని...

తంగెళ్లమూడికి చెందిన చొదిమెళ్ల బాలకృష్ణ తమ ఇంటి స్థలం ఆక్రమణకు గురౌతుందని, ఆ స్థలానికి సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలను తొలగించాలని కోరుతూ అర్జీ అందజేశారు. పెదపాడు మండలం కలపర్రు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఫిషర్‌మేన్ సొసైటీని రద్దు చేసి రెవెన్యూ అధికారిచే దర్యాప్తు చేయించి చెరువును కాపాడాలని అర్జీ అందజేశారు. చింతలపూడి మండలం తీగలవంచకు చెందిన వెంకటేశ్వరరావు తమ భూమిని ఆన్‌లైన్, అడంగల్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశారు. హౌసింగ్, ఫీజు రీయంబర్స్‌మెంట్, పోలీస్ కేసులు, భూమి తగాదాలు తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ ఎఒ నాంచారయ్య పాల్గొన్నారు.

భూముల రికార్డులు, టైటిల్ వెరిఫికేషన్ చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

పశ్చిమ ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కరించడం కోసం అధికారులు ఇరుపక్షాల భూ రికార్డులను టైటిల్ వెరిఫికేషన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలంలోని కోటరామచంద్రపురం ఐటిడిఎ గ్రీవెన్స్ కార్యక్రమంలో గిరిజన సంఘం తరుపున పలు సమస్యలపై ఐటిడిఎ ఎపిఒ పివిఎస్.నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శులు కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ ఏజెన్సీ భూభాగంలో ప్రభుత్వ ఎడబ్ల్యుడి, గయ్యాలు, ప్రభుత్వ పోరంబోకు వంటి భూములు స్థానిక గిరిజనులకే చెందుతాయన్నారు. మండలంలోని అంతర్వేదిగూడెం రెవెన్యూ ఇనుమూరు గ్రామ సమీపంలో సుమారు 80 ఎకరాలు ఎడబ్ల్యుడి భూమి దొరమామిడి గ్రామానికి చెందిన గిరిజనేతరులకు అక్రమ పద్ధతిలో వారసత్వంగా చూపిస్తున్నారన్నారు. 1994 వరకు ఎడబ్ల్యుడి భూమిగా ఉన్న భూములు గిరిజనేతరులకు ఏ విధంగా వారసత్వం వచ్చిందో రెవెన్యూ అధికారులు స్పష్టం చేయాలన్నారు. అంతర్వేదిగూడెం రెవెన్యూ గ్రామం కానివారికి దొరమామిడి గిరిజనేతరుల పేరుతో ఉన్న భూ రికార్డుల్లో వారి పేర్లు తొలగించి స్థానిక ఇనుమూరు గిరిజనుల పేర్లు నమోదు చేసి హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య భూ వివాదాలు వచ్చినప్పుడు అధికారులు ఇరుపక్షాల రికార్డులను గతంలో చూసేవారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు భూ రికార్డులు టైటిల్ వెరిఫికేషన్ చేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. సెప్టెంబర్ 24వ తేదీ నుంచి రాష్ట్రంలో అన్ని ఐటిడిఎ పరిధిలో ఉన్న షెడ్యూల్డ్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించటానికి పిసా, గ్రామ కమిటీలు పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 24వ తేదీ నుంచి పిసా గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఐటిడిఎ పరిధిలో పిసా గ్రామకమిటీలు ఏర్పాటు చేయటానికి షెడ్యూల్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పిసా గ్రామసభ నిర్వహించడం కోసం ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని సూచించారు. పాత పిసా గ్రామ కమిటీలు ఉన్నా పరిగణలో లేకుండా పోయిందని, ఆదివాసీల అభివృద్ధికి పిసా గ్రామ కమిటీలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. అన్ని గ్రామాల్లో పిసా గ్రామసభలు నిర్వహించాలని, ఎటువంటి గిరిజనేతరుల పెత్తనాలు, బెదిరింపులు లేకుండా అవగాహన కలిగిన గిరిజనులతో నూతన కమిటీలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే గిరిజనులతో ఐటిడిఎ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం ముత్యాలరావు, కోడిమి లక్ష్మడు, పి.అక్కమ్మ, టి.మంగతాయారు, బి.తేజ, తెల్లం ముత్యాలమ్మ, సిహెచ్.రాజు, జోడే చంద్రరావు, టి.ముత్యాలరావు, కూరం సీత, కె.వసంత పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నేతలు

లాభాల బాటలో నారాయణపురం సొసైటీ

ఆన్‌లైన్ ప్రక్రియ నూరుశాతం పూర్తి

సొసైటీ పర్సన్‌ఇన్‌ఛార్జి నరసింహారావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ది.చేబ్రోలు విశాల సహకార సంఘం నారాయణపురం (సొసైటీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.118 కోట్ల టర్నోవర్‌పై రూ.76,95,085 లాభాలు ఆర్జించి ఏలూరు జిల్లాకు ఆదర్శనీయంగా ఉందని ఆ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి కురిచేటి నరసింహారావు అన్నారు. సోమవారం సాయంత్రం సొసైటీలో సర్వసభ్య సమావేశం సిఇఒ యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో చిన్న సొసైటీల్లో శనివారపుపేట, పెద్ద సొసైటీల్లో నారాయణపురం సొసైటీలో అన్ని విభాగాల్లో ఆన్‌లైన్ పూర్తి చేశామన్నారు. 22765 మంది సభ్యులుగా ఉన్న ఈ సహకార సంఘంలో 20811 మంది రికార్డులు పూర్తిగా కంప్యూటరీకరించామన్నారు. 1949 మంది ఇకెవైసిలు ఇవ్వని కారణంగా పార్కింగ్ ఖాతాలుగా మర్చామన్నారు. రైతులు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకువచ్చి ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఈ సీజన్‌లో రైతులు నచ్చిన మిల్లులకు ధాన్యం తోలుకునే అవకాశం ఉందని సిఇఒ శ్రీనివాస్ వెల్లడించారు. సొసైటీ కార్యాలయం వద్ద 300 రకాల పౌర సేవలను వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. రైతులు గోలి శ్రీనివాసరావు, పరిమి రామచంద్రరావు, ఆలపాటి గిరీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహారావు

ఆర్‌డిఒగా అంబరీష్ బాధ్యతలు స్వీకరణ

ఏలూరు : ఏలూరు ఆర్‌డిఒగా నియమితులైన ఎం.అచ్యుత అంబరీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ డి.పుష్పమణిని కలిసి పూల మొక్కలను అందజేశారు.

విధుల నుంచి విద్యాసాగర్ తొలగింపు అన్యాయం

ఏలూరు అర్బన్ : ఏలూరు అర్బన్ డిప్యూటీ తహశీల్దార్ లామ్ విద్యాసాగర్‌ను విధుల నుండి తొలగించడాన్ని సిఐటియు జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. వారం రోజుల్లో ఉద్యోగ విరమణ ఉండగా కక్షపూరితంగా విద్యాసాగర్‌ను విధుల నుండి తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. గతంలో ఎన్‌జిఒ సంఘం, రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకునిగా ఉద్యోగుల సమస్యలపై కృషి చేసిన విద్యాసాగర్‌పై కుట్రపూరితంగా వ్యవహరించి రిటైర్‌మెంట్ ముందు పథకం ప్రకారం ఉద్యోగం నుంచి తొలగించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని అక్రమ తొలగింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చింతలపూడి అభివృద్ధికి కృషి చేస్తా

నూతన కమిషనర్ పావని

ప్రజాశక్తి - చింతలపూడి

కష్టపడితే అనుకున్న స్థాయిలో ఉండవచ్చని ఆమె నిరూపించింది. ఉద్యోగం వచ్చింది కదా ఆగిపోకుండా మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలనే ఆమె పట్టుదల ఈ రోజున ఈ స్థాయిలో నిలబెట్టింది. డెంటిస్ట్‌గా ప్రజలకు సేవలందించి, ఇంకా మెరుగైన సేవలందించాని లక్ష్యంగా పెట్టుకుంది. డెంటిస్ట్‌గా ప్రజలకు సేవలందిస్తూనే తల్లిదండ్రుల సహకారంతో గ్రూప్-1 పరీక్షలు ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలిచింది. చింతలపూడి నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా నియామకమైంది పావని. చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానంటున్న ఆమె ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ప్రస్తుతం ఎక్కడ నుంచి వచ్చారు? సొంత ఊరు ఎక్కడ?

కమిషనర్ : సొంత ఊరు ప్రకాశం జిల్లా ఒంగోలు. చిన్నప్పటి నుంచి ప్రజలకు సేవ చేయలనే తపన ఉండేది. దానికి తగ్గట్టుగానే కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చాను. బిడిఎస్ చేసి డెంటిస్ట్‌గా కొంతకాలం పని చేశాను. అయినా ప్రజలకు మరింత సేవ చేయాలని, గ్రూపు-1 ఉద్యోగం సాధించడానికి కష్టపడ్డాను. ఫలితం సాధించాను. రాజమండ్రి రూడో కార్యాలయం ఎఒగా పనిచేస్తున్నాను. చింతలపూడి ఫుల్ ఇన్‌ఛార్జిగా వచ్చాను.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీలో పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

కమిషనర్ : చింతలపూడి నగర పంచాయతీ పారిశుధ్యంపై ప్రజలకు ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాను. ప్రతిరోజు ప్రతి ఏరియాలో తిరుగుతాను. ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తాను.

ప్రశ్న : చింతలపూడి సెంట్రల్ లైటింగ్ గురించి ఏమైనా చర్యలు తీసుకుంటారా? నగర పంచాయతీ పరిధిలో వీధిదీపాలు లేవని కొందరు ఫిర్యాదు చేస్తున్నారు దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

కమిషనర్ : చింతలపూడి సెంట్రల్ లైటింగ్ గురించి పూర్తిగా తెలుసుకుంటాను సెంట్రింగ్ లైటింగ్ వెలిగించడానికి కృషి చేస్తాను. నగర పంచాయతీ పరిధిలో ఏ వీధిలో వీధి దీపాలు వెలగడం లేదో తెలుసుకుని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను.

ప్రశ్న : నగర పంచాయతీలో అభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేస్తారు?

కమిషనర్ : చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌తో నగర పంచాయతీకి కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి చర్చించి, అభివృద్ధికి అడుగులు వేస్తాము. నగర పంచాయతీలో ఉన్న పెద్దలతో చర్చించి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తాను. వీధి దీపాలు, రోడ్లు, డ్రెయినేజీలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను.

ప్రశ్న : డెంటిస్ట్‌గా సంతృప్తి చెందారా? లేక గ్రూప్-1 అధికారిగా సంతృప్తి నిచ్చిందా?

కమిషనర్ : రెండు ప్రజాసేవకు సంబంధించినవే. ప్రజలకు మరింతగా సేవ చేయలని ఉద్దేశంతో ఇటువైపుగా అడుగులు వేశాను.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీలో ఉన్న అధికారులు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు? సిబ్బంది ఖాళీలను ఎలా భర్తీ చేస్తారు?

కమిషనర్ : కచ్చితంగా అవసరమైన సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి భర్తీ చేస్తాను.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీ ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

కమిషనర్ : ఏ సమస్యలున్నా నేరుగా నా వద్దకు వచ్చి తెలియజేయండి. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాను. చింతలపూడి నగర పంచాయతీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వచ్చాను. ప్రజలు సహకరించాలి

ఆశావర్కర్ లక్ష్మీమంగను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉద్యోగ బాధ్యతల నుంచి తొలగించిన గండిగూడెం ఆశావర్కర్ కాసగాని లక్ష్మీమంగను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆశావర్కర్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పోచమ్మ డిమాండ్ చేశారు. ఆశావర్కర్‌కు మద్దతుగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లాల్లోని పలువురు ఆశావర్కర్లు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం ర్యాలీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పోచమ్మ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రి పరిధిలో ఉన్న గండిగూడెం ఆశావర్కర్‌గా పనిచేస్తున్న లక్ష్మీమంగను సచివాలయంలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పి వేధింపులకు గురి చేయడంతో వైద్యాధికారికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఎంఎల్‌హెచ్‌పి రాజకీయ నాయకులు అండదండలతో ఉన్నతాధికారులతో లక్ష్మీమంగను సస్పెండ్ చేపించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి లక్ష్మీమంగను ఉద్యోగంలోకి తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్‌కు న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు ఎన్.జ్యోతి, కె.వనిత, ఇ.లక్ష్మి, దేవమాత ఉన్నారు.

ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బాలల హక్కుల పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, బాలల కోసం లేదా బాలలతో పనిచేస్తున్న కార్యకర్తలు బాలల సమగ్ర అభివృద్ధికి పునరంకితం కావాలని, బాలల హక్కుల కార్యకర్త గోడే ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని హిల్ ప్యారడైజ్ చిల్డ్రన్ హోమ్‌లో పని చేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

చింతలపూడి :విజయవాడ వరద బాధితుల సహాయార్థం టిడిపి లింగపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.మూడు లక్షలు ఇవ్వడం అభినందనీయమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం చింతలపూడిను కలిసి రూ.మూడు లక్ష చెక్కును అందించారు.

ఉద్యోగ విరమణ సర్వ సాధారణం : ఎంఇఒ

ముదినేపల్లి :ఉద్యోగ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం ఆనందంగా గడపాలని ఎంఇఒ కె.నరేష్‌కుమార్ అన్నారు. సోమవారం ముదినేపల్లి ఎంఆర్‌సి భవనంలో ప్రధానోపాధ్యాయులు సాల్మన్‌రాజు ఉద్యోగ విరమణ సన్మానసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 28 ఏళ్ల విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి కొరగంటిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సాల్మన్‌రాజు ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. సాల్మన్‌రాజును వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు.

సాల్మన్‌రాజును సన్మానిస్తున్న ఎంఇఒ నరేష్

ముగిసిన పౌష్టికాహార వారోత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం ఐసిడిఎస్ పరిధిలోని అంకాలగూడెం సెక్టార్‌లో పోషకాహార వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి తులసి ముఖ్య అతిథిగా విచ్చేసి పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పౌష్టికాహార వారోత్సవాలు

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

దెందులూరు :బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధాం, ప్లాస్టిక్‌పై అవగాహనా కార్యక్రమాన్ని పదో వార్డు సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ప్రజలకు అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలు, వాడిన తర్వాత దానిని ఏ విధంగా మార్చుకోవాలనే విధానాన్ని పాటల రూపంలో, నృత్య రూపంలో, నాటిక రూపంలో ప్రజలకు తెలిపారు.

హరిజనపేటలో డ్రెయినేజీ పూడికతీత

ముసునూరు :మంత్రి కొలుసు పార్థసారథి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని టిడిపి వలసపల్లి గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర అన్నారు. వలసపల్లిలో డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టారని చెప్పారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ వారం రోజుల క్రితం మండలంలోని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి మండలంలోని గ్రామ సర్పంచులు డ్రెయినేజీ వ్యవస్థ బాగోలేదని తీసుకెళ్లారన్నారు.. ఆయన వెంటనే స్పందించి 16 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు డ్రెయినేజీ పూడిక తీయించే విధంగా తమ సొంత ఖర్చుతో పొక్లెయిన్ పంపిస్తానని చెప్పారన్నారు. ఆ విధంగానే సోమవారం వలసపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో హరిజనవాడలో సర్పంచి చలసాని దామోదరరావు, పంచాయతీ కార్యదర్శి పామార్తి వెంకటవీర్రాజు, ఇంజినీరింగ్ సహాయకులు కలపాల అంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రెయినేజీ పూడికతీత కార్యక్రమం చేపట్టారు. ఈ పూడికతీత కార్యక్రమం వారం రోజుల పాటు వలసపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతుందని, అదేవిధంగా అన్ని గ్రామాలకు పొక్లెయిన్ ద్వారా డ్రెయినేజీ పూడిక తీస్తారని తెలిపారు.

పనులు చేయిస్తున్న సర్పంచి, నాయకులు

శ్రీనివాస్‌కు హృదయరాజు సత్కారం

ఏలూరు :జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెఎన్‌వి.శ్రీనివాస్‌ను ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు సన్మానించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఏలూరు పంచాయతీ రాజ్ ఉద్యోగుల భవనంలో ఏలూరు జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను హృదయరాజు సత్కరించారు.

శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న హృదయరాజు

వర్షపు నీరు తొలగింపు

మండవల్లి :పల్లపు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీటిని తొలగించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ తెలిపారు. మండవల్లి దళితవాడలో రహదారుల పైకి చేరుకున్న మురుగునీటిని పంచాయతీ సిబ్బంది మోటార్ సహాయంతో తొలగించే విధానాన్ని సోమవారం ఆమె దగ్గరుండి పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటి నుంచి రోడ్లపైకి చేరుకున్న నీటిని తొలగిస్తున్నామన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
జంగారెడ్డిగూడెం, కైకలూరు, పెదవేగి, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, భీమవరం అర్బన్, ఇరగవరం, పెంటపాడు, పోడూరు, ఏలూరు కల్చరల్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
నూజివీడు, విజయరాయి, కైకలూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం
ఇంటర్వ్యూ : తేది: 02-10-2024 బుధవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, బలుసువారి వీధి, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190

విద్యార్థినులపై లైంగికదాడులు అరికట్టాలి

ఏలూరు అమీనాపేటలో స్వామి దయానంద సరస్వతి బాలికల వసతి గృహంలో విద్యార్థినులపై లైంగిక దాడులు అరికట్టడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించాలి. దేశంలో 23 రాష్ట్రాలకు 101 ఆలిండియా మూమెంట్ సేవ (ఎం ఫర్ సేవ) గుడివాడ బ్రాంచితో పాటు అమీనాపేటలో స్వామి దయానంద సరస్వతి ట్రస్ట్‌లో దాతల సహకారంతో సేవా సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థినులకు వసతిగృహం ఏర్పాటు చేశారు. దీనికి ఎగ్జిక్యూటివ్ బోర్డ్ మెంబర్స్, స్థానిక లోకల్ కో-ఆర్డినేటర్స్ ఐదుగురు డైరెక్టర్స్‌గా ఉన్నారు. లోకల్ కో-ఆర్డినేటర్‌తో శశికుమార్ పరిచయం చేసుకుని తన గురించి దయానంద స్వామికి చెప్పుకున్నాడు. ఆ తర్వాత స్వామీజీ దగ్గర కో-ఆర్డినేటర్ పైనే మాయమాటలు చెప్పి స్వామి దయానంద సరస్వతికి దగ్గరయ్యాడు. భార్య ఫణిశ్రీని నిర్వాహకురాలిగా నియమించేలా చేశాడు. అనంతరం ఆమె మేనకోడలు బయ్యారపు లావణ్యను కూడా ఈ సంస్థకు పరిచయం చేసి ఆమెను కేర్‌టేకర్‌గా నియమించేలా చేశాడు. వీరిద్దరి ద్వారా స్వచ్ఛంద సంస్థను ఆశ్రయంగా చేసుకుని బాలికలు ఉండే ప్రాంతంలో రాత్రులు సంచరిస్తూ, మాయ మాటలు చెప్పి బాలికలపై పైశాచిక ఆనందం పొందాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే మీ వసతి సౌకర్యం క్యాన్సిల్ చేస్తామని బెదిరించే వాడని విద్యార్థినులు వాపోతున్నారు. గత మూడేళ్లుగా ఈ సంస్థ నడుస్తున్నార, అసలు ఈ సంస్థలో విద్యార్థిని వసతి గృహం ఉన్నట్లు కూడా కూతవేటు దూరంలో ఉన్న అధికారులకు తెలియదు. మరి ఇక్కడకు విద్యార్థులు ఎలా వచ్చి చేరారో ప్రశ్నార్థకం. పక్కనే ఉన్న ఎస్‌సి వన్, బిసి హాస్టల్లో చేరేందుకు వచ్చిన విద్యార్థులను అక్కడ ఎవరూ చేర్పించారు? ఇంతకాలమైనా రిజిస్టర్ కాకుండా ఎలా నడిపారు? దీనికి కారణం ఎవరు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వమే బదులు ఇవ్వాలి. సెప్టెంబర్ 15న పూజల పేరుతో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిని బాపట్ల తీసుకెళ్లి అక్కడి నుంచి వేటపాలెం బాలుర హాస్టల్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. అంతేకాకుండా విద్యార్థులకు ఫొటోగ్రఫీ నేర్పిస్తానని లోబరుచుకున్నాడు. బాధిత విద్యార్థిని తోటి విద్యార్థినితో చెప్పి బాధపడడంతో వారు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి సమాచారం ఇస్తే ఆ విద్యార్థులను మానసికంగా ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి వేధించారే తప్ప వారికి ధైర్యం కల్పించకపోగా దుర్మార్గునిపై చర్యలు శూన్యం. ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పరిశీలన చేసి శశికుమార్‌నజు, తనకు సహకరించిన ఫణిశ్రీ, లావణ్యలను కఠినంగా శిక్షించాలని, శశికుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు దీనిపై చైల్డ్ వెల్ఫేర్ తీసుకున్న చర్యలు ఏమిటో కూడా ప్రశ్నార్థకమే. విద్యార్థులు అభద్రతభావంతో ఇళ్లకు వెళ్లిపోయారు. కొంతమంది టిసి తీసేసుకున్నారు. కొంతమందికి మాత్రమే ఇతర హాస్టల్లో వసతి సౌకర్యం కల్పించారు. రెండురోజుల తర్వాత మేము హాస్టల్ దగ్గరికి వెళ్లగా అప్పుడే తాళం తెరిచారు. ఉన్న కొంతమంది పిల్లల్ని గంటల తరబడి పోలీసులు వాంగ్మూలం తీసుకున్నారు తప్ప వారికి భరోసా కల్పించి వారి చదువులు కొనసాగేలా ప్రభుత్వం చొరవ చూపలేదు. నిందితులను కఠినంగా శిక్షించి విద్యార్థినులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం ద్వారా భరోసా, భద్రత కల్పించాలి. అందుకు తగ్గట్లు కాకుండా వ్యవహారం నుంచి ఏదోలా బయటపడడం, చేతులు దులుపుకోవడం అంతకు మించి పైవారి నుంచి ఒత్తిడులే ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఏలూరుకు 50 కిలోమీటర్ల దూరంలో రాష్ట్ర రాజధాని ఉంది 53 పేద విద్యార్థినులకు ఇంతటి కష్టం వస్తే మా ఆడపడుచులు అనే సిఎం ఏమైనట్లు? ప్రశ్నించడానికే పుట్టిన డిప్యూటీ సిఎం ఏమైనట్లు, దీని వెనుక పెద్దల హస్తం ఉందని అధికారుల చర్యలే తెలియజేస్తున్నాయి. ఇప్పటికీ ఆ వసతి గృహానికి చెందిన విద్యార్థినులకు ప్రభుత్వం జిల్లా అధికారులు సరైన అవగాహన కలిగించలేదనేది అక్షరసత్యం. ఏలూరు జిల్లాలో ఇప్పటికే కలిదిండి, నూజివీడు, ఏలూరు పరిసరాల్లో బాలికలపై ఈ రెండు నెలల్లోనే పలు అత్యాచారాలు జరిగాయి. ఏలూరులో నిస్సహాయ మహిళపై సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో నైట్ డ్యూటీలో ఉన్న డాక్టర్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ కాలంలో నిస్సహాయ మహిళలపై, బాలికలపై అత్యాచారాలు పెరుగుతున్న ఈ తరుణంలో వారికి తగిన రక్షణ భరోసా ఏది? నిందితులను కఠినంగా శిక్షించడం ద్వారా తగిన రక్షణ భరోసా కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. లేకపోతే మహిళా సంఘాలే కాకుండా ప్రజాతంత్ర వాదులంతా ప్రభుత్వాన్ని ఎండగట్టాల్సి ఉంది.

- ఎ.శ్యామలారాణి,
ఐద్వా జిల్లా కార్యదర్శి

ఏలూరులో సత్య ఏజెన్సీస్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సత్య ఫోరమ్ ద్వారా ప్రజలకు, వినియోగదారులకు నిర్ణీత సరసమైన ధరలకు హోమ్ నీడ్ అప్లయెన్సెస్ అందుబాటులో ఉన్నాయని ఏలూరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్య ఫోరం నిర్వాహకులు సురేష్ తెలిపారు. ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద గుమ్మడి గ్రాండ్ పక్కన నూతనంగా సత్య ఏజెన్సీస్‌ను రాష్ట్రంలో 36వ బ్రాంచిగా ఓనర్ సత్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు రూ.30 వేల విలువైన వస్తువు కొన్నవారికి గోల్డ్ కాయిన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఫెస్టివల్ సందర్భంగా మూడో తేదీ నుంచి ఈ ఆఫర్లు ప్రజలందరికీ అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.42/2019 in O.S.No.369/2014
డి.హెచ్.ఆర్: చెప్పూరి బాలకృష్ణ
VS
జె.డి.ఆర్: పోలిశెట్టి శ్రీనివాసరావు
ఐ.పి. షెడ్యూలు
1) పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు, మండలం, మొగల్తూరు సబ్ రిజిస్ట్రర్‌లో చేరిన మొగల్తూరు గ్రామ రెవిన్యూ ఆర్.ఎస్.నెం. 932/5లో య.0-16చ లో కొబ్బరి చెట్లుతో సహా హద్దులు:
తూర్పు: పులపర్తి సూర్యనారాయణ మరియు పంట బోదె. దక్షిణం: పులపర్తి కాశీవిశ్వనాథం గారి కొబ్బరి తోట. పడమర: యాతం వెంకట నరసింహస్వామి గారి భూమి. ఈ హద్దుల మధ్య య.0-16చ భూమి, ఇందలి నానావిధ ఫల వృక్షములతో సహా.
2) ఆర్.ఎస్.నెం.694/3లో య.0-48చ మామిడి తోటకు హద్దులు:
తూర్పు: చెన్ను సూరిబాబు. దక్షిణం: ఇతరుల ఇల్లు. పడమర: కొప్పినీడి శేషగిరి. ఉత్తరం: అనంతపల్లి కామేశ్వరరావు. ఈ హద్దుల మధ్య య.0-48చ భూమి, ఇందలి నానావిధ ఫల వృక్షములతో సహా.
పై ఆస్తిని డి.హెచ్.ఆర్ బాకీ వసూలు నిమిత్తం పై కోర్టు వారు ది.18-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లు లగాయతు కోర్టు వారి వేలంపాట విక్రయించబడును. కాబట్టి పై ప్రజలు సదరు వేలంలో పాల్గొని సదరు ఆస్తిని వేలంపాట పాడుకొనవలసినదిగా కోర్టు వారు ప్రజలందరికి ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
ఐటెం-1
డి.హెచ్.ఆర్. విలువ : రూ.80,000/-
అమీనా విలువ : రూ.16,00,000/-
ఐటెం-2
డి.హెచ్.ఆర్. విలువ : రూ.1,20,000/-
అమీనా విలువ : రూ.24,00,000/-
(By Order Of The Court)
శ్రీ గునిశెట్టి శ్రీనివాసరావు
డి.హెచ్.ఆర్. తరుపు అడ్వకేట్,
నర్సాపురం, నర్సాపురం.
28-09-24. సెల్: 9553126234

రాష్ట్రస్థాయి పోటీలకు తిమ్మాపురం విద్యార్థినులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని తిమ్మాపురం హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు పొనుకుమాటి దివ్య, శ్రీగిరిరాధికలు ఇటీవల గణపవరం బాలుర హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన సాఫ్ట్ టెన్నిస్ అండర్-17 బాలికల విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు స్టేట్ మీట్ సెలక్షన్స్ నవంబర్‌లో కడపలో జరిగే రాష్ట్రస్థాయి విభాగంలో పాల్గొంటారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సూర్యనారాయణ తెలిపారు. పాఠశాల విద్యార్థులకు చక్కని శిక్షణ ఇచ్చిన పీడీ గుడి సత్యనారాయణను అభినందించారు. చక్కని ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఉపాధ్యాయ సిబ్బంది, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వల్లంపట్ల మాజీ సర్పంచి, ఎంపిటిసిగా పనిచేసిన గాదె రాజేంద్రప్రసాద్‌రెడ్డి సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రాజేంద్రప్రసాద్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని వైసిపి మండలాధ్యక్షులు శ్రీనురాజు, జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు అన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

నూజివీడు టౌన్ :సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ అధికారి డాక్టర్ సౌమ్య తెలిపారు. నూజివీడు కోనేరుపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని బొర్రంపాలెం చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు మంగరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో సోమవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో బాగంగా బొర్రంపాలెం శాఖ చైతన్య గోదావరి బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో ఖాతాదారులతో కలిసి పలు రకాల మొక్కలను రహదారులకు ఇరువైపులా నాటారు.

జాతీయ రహదారి విస్తరణకు సర్వే

జీలుగుమిల్లి:మండలంలోని తాటియాకుల గూడెం నుంచి పట్టిసీమ వరకు జాతీయ రహదారి (365 బిబి) విస్తరణకు సంబంధించి సర్వే ప్రారంభించినట్లు ఎఇ ఖాజాబాబు తెలిపారు. సోమవారం జాతీయ రహదారి నాలుగు లైన్లకు సంబంధించి తాటియాకులగూడెం నుంచి సర్వే బృందంతో సర్వే చేపించినట్లు తెలిపారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించాలి

పోలవరం :పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో ఉన్న బస్టాండ్ పరిధిలో మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతూ సిపిఎం పోలవరం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు మండల డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిబద్ధత, జవాబుదారీతనంతో పనిచేస్తేనే గుర్తింపు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

నిబద్ధత, జవాబుదారీతనంతో పనిచేస్తే ప్రతి ఉద్యోగికీ మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు, నూజివీడు డివిజన్ల ఆర్‌డిఒలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ, వై.భవానీశంకరిలకు సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డిఒలు తమ విధి నిర్వహణలో తమదైన ముద్ర వేసుకున్నారన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ వై.భవానీశంకరిలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.

శ్రీసత్యసాయి సేవా సంఘం సేవలు అభినందనీయం

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ఏలూరు స్పోర్ట్స్:ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారంటే శ్రీసత్యసాయి సేవా సంఘం వారు సహాయాన్ని అందిస్తున్నారని, గతంలో విజయవాడ వరదల సమయంలో కూడా వారు విశేష కృషి చేశారని వారి సేవలను ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ అభినందించారు. చింతలపూడి మండలంలోని రాఘవాపురానికి చెందిన పసుపులేటి పుల్లారావు, కృష్ణవేణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు భువనేశ్వరి, గీతాంజలి ఉన్నారు. తాము పేదవారమని, ఎవ్వరైనా చదివిస్తే బాగా చదువుకుని వారి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలను కుంటున్నామని ఆ దంపతుల కుమార్తెల కోరిన విషయం గురించి తెలుసుకున్న ఎస్‌పి వారిద్దరి చదువు నిమిత్తం ఏదైనా సహాయం చేయాలనే ఉద్దేశంతో శ్రీ సత్యసాయి సేవా సంఘం వారికి సదరు సమాచారాన్ని అందించారు. వారి తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వరి, గీతాంజలిల చదువు నిమిత్తం రూ.15 వేలు, రూ.పది వేల విలువైన ఆహారపదార్థాలను ఎస్‌పి చేతులమీదుగా సంఘం ప్రతినిధులు వారు అందించారు. ప్రతి నెలా వారికి అమృత కలశం ద్వారా నెలకు సరిపడే ఆహార పదార్థాలను అందిస్తామని శ్రీ సత్యసాయి సేవా సంఘం ప్రతినిధులు హామీ ఇచ్చారు.

జాతీయ స్థాయి పోటీలకు సాయిప్రకాష్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ డేటా సైన్స్ విభాగం రెండో సంవత్సరం చదువుతున్న తాతా సాయి ప్రకాష్ అండర్-19 ఎపి టీమ్‌కు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌతు తెలిపారు. ఈ టీమ్ వచ్చే నెల నాలుగో తేదీన పంజాబ్ రాష్ట్రంలోని మహాలీ నగరంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి.సురేంద్రబాబు, విభాగాధిపతి సిహెచ్.మురళీకృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్.మాధవరావులు తాతా సాయి ప్రకాష్‌ను అభినందించారు.

సాయిప్రకాష్

ఒకసారి రుణం తీసుకుంటే రెండుసార్లు వసూలు

బ్యాంకు అధికారుల తీరుపై రైతు సంఘం ఆధ్వర్యాన రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కుక్కునూరు

ఒక్కసారి తీసుకున్న రుణానికి రెండుసార్లు సొమ్ము వసూలు చేసిన బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు సోమవారం ఎస్‌బిఐ బూర్గంపాడు బ్రాంచి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ పోలవరం బ్యాక్ వ్యాటర్ వల్ల ముంపునకు గురైన కుక్కునూరు, వేలూరుపాడు మండల రైతాంగానికి చెందిన భూములను 2017లో భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం బ్యాంకుల ద్వారా చెల్లించారన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండల రైతులు పరిహారానికి ముందు ఎస్‌బిఐ బూర్గంపాడు బ్రాంచిలో పంట రుణాలు తీసుకున్నారన్నారు. భూసేకరణ పరిహారం రైతులకు అందేలోపు బ్యాంకు అధికారులు తాము ఇచ్చిన రుణాల రికవరీ కోసం కోర్టు నుంచి అనుమతి పొందారన్నారు. ఆ విధంగా రైతులకు తెలియకుండానే బ్యాంకు అధికారులు రైతులకు వచ్చే పరిహారంలో రుణాలు రికవరీ చేసుకున్నారని, రికవరీ పోను మిగతా డబ్బులకు బ్యాంకుకు వెళ్తే మళ్లీ రికవరీ చేసుకుని రైతులను నష్టపరిచారన్నారు. దీనిపై బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చినా తీసుకోవడానికి నిరాకరించారన్నారు. వెంటనే విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై సత్వర చర్యలు చేపట్టాలి

దెందులూరు :ప్రజా సమస్యలపై వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించటంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులతో ప్రజల సమస్యలపై చర్చించారు. ఇకపై ప్రతివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జరిగే మీకోసం కార్యక్రమంలో తాను కూడా భాగస్వామ్యం అవుతానని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

నూజివీడు టౌన్ :ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని వెంటనే అమలుపరచాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక నూజివీడు పట్టణంలో ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు కూడా మధ్యాహ్న భోజనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

జిఒ 36 ప్రకారం నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.21 వేల జీతం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు టి.బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన నగర కమిషనర్ డి.పావనిని మున్సిపల్ వర్కర్స్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా టి.బాబు మాట్లాడుతూ జనవరి నెలలో మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా అప్పటి ప్రభుత్వం జిఒ 36 జారీ చేసి వీరికి జీతం రూ.20 వేలు చేసిందని, ట్రాక్టర్ డ్రైవర్‌కు రూ.24,500గా నిర్ణయిస్తూ జిఒ 36 విడుదల చేయగా మే నెల నుంచి అన్ని మున్సిపల్ నగర పంచాయతీల్లో ఇది అమలవుతుండగా చింతలపూడి నగర పంచాయతీలో అమలు జరగడం లేదన్నారు. రూ.15 వేలు జీతం ఇస్తున్నారని, సంక్రాంతి బోనస్ రూ.వెయ్యి ఇవ్వాలని, జిఒ 12 ఉండగా ఇప్పటికీ బోనస్ ఇవ్వలేదని చెప్పారు.

మరుగుదొడ్లు నిర్మించాలి : సిపిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీలో పబ్లిక్ టాయిలెట్స్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో చింతలపూడి పట్టణ శాఖ సమావేశం ఎస్‌కె కాలేషా అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ పాతబస్టాండ్, ఫైర్ స్టేషన్ సెంటర్, గురుభట్లగూడెం రోడ్డు సెంటర్‌లలో పబ్లిక్ టాయిలెట్స్, బాత్రూమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 1993 సంవత్సరంలో ఆమోదించిన మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు.

CERTIFICATES MISSING
Rajesh Gangadhar Maraju on his way to Narsapur town to make xerox of his 12th std Statement of Marks (No. 70003361) and Pass Certificate (No.10003358) has lost his documents. His full name is Rajesh Gangadhar Maraju with the index no. 2213174/037, he passed in the year of 2021 in Flaiz Memorial Higher Secondary School of Seventh Day Adventist, Narsapur 534275.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
ఐ.పి.నెం.15/2024
బిట్వీన్:
బొచ్చు రమేష్
బొచ్చు నాగమణి ...పిటీషనర్స్
మరియు
మానుపాటి మురళి వగైరాలు ...రెస్పాండెంట్స్
ఇందుమూలముగా ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన బొచ్చు రమేష్, బొచ్చు నాగమణిలు మానుపాటి మురళి మున్నగు వారిపై ది.27-06-2024వ తేదీన ఋణ ఎగవేత పిటీషనున్ను దాఖలు చేసియున్నారు. కావున సదరు పిటీషనుపై ప్రజానీకానికి ఎటువంటి అభ్యంతరములు మరియు ఆక్షేపణలు ఉన్న ఐ.పి.15/2024కు వాయిదా ది.04-10-2024వ తేదీన కలదని మీ అభ్యంతరములు మరియు ఆక్షేపణలు శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని హాజరు తెలియజేయవలసినదిగా ఈ జనరల్ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
గాజుల గోపికృష్ణ
యర్రంశెట్టి లక్ష్మీ ప్రసన్న రాణి
తాడేపల్లిగూడెం, అడ్వకేట్స్,
04-10-24. తాడేపల్లిగూడెం.
సెల్: 98487 85739

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
Debtors I.P. No.17/2024
Between:
1.రేలంగి నరసింహ స్వామి, S/o. సత్యనారాయణ, డోర్. నెం.33-9-31, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
2.రేలంగి శ్రీరంగనాయకులు, S/o. నరసింహ స్వామి, డోర్. నెం.33-9-31, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా. ...పిటీషనర్స్
VS
1.పడమటి సూరిబాబు, S/o.సూరన్న, ఆదిశంకర కంటి ఆసుపత్రి వద్ద, రాజీవ్ నగర్, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
2.పడిసపు శేఖర్, S/o.సత్యనారాయణ, డోర్ నెం. 33-7-5, అచ్చుగట్లపాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.
3.కొప్పినీడి పుల్లారావు, S/o. సూర్యనారాయణ, డోర్ నెం.33-12-1, రాజవీధి, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
4.చిల్లిముంతల కృష్ణమోహనరావు, S/o.లక్ష్మయ్య, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
5.చెక్కా కృష్ణ, S/o.పుల్లారావు, మారుతి సినిమా థియేటర్ వద్ద, అచ్చుగట్లపాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
6.కొడవటి నాగ సూర్య చంద్రశేఖర్, S/o. దత్తాత్రేయులు, House No.6A-8/1, ఫ్లాట్ నెం.202, లాక్ దిగువన, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
7.నిట్టల నాగ శ్రీనివాసు, S/o.రామారావు, నాగరాజు పేట, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
8.పంట్ల రాము, S/o.గురువులు, డోర్ నెం.7-5-21, మావుళ్ళమ్మ గుడి వెనుక, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
9.పంట్ల దుర్గారావు, S/o.రాము, డోర్ నెం.7-5-21, మావుళ్ళమ్మ గుడి వెనుక, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
10.శేగు వెంకట శివరావు, S/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం.33-11-3/1, మేకా వారి వీధి, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
11.కోరుకొండ వి.వి.ఎన్.జి.ఎస్. పార్వతి మణి కుమార్, S/o.ఆంజనేయులు, డోర్ నెం.39-1-22, త్సవటపల్లి వారి వీధి, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
12.తోట సత్యనారాయణ, S/o.సుబ్బారావు, డోర్ నెం.29-3-35, కర్ణాల వారి వీధి, సుబ్బారాయుడు గుడి వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
13.బండారు నరసింహారావు, S/o. అప్పారావు, గంజి పేట, బంగారువారి చెరువు గట్టు, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
14.టంగుటూరి వెంకట సంతోష్ కుమార్, S/o.రమేష్, శ్రీ వెంకట సాయి ఫైనాన్స్, మారుతి థియేటర్ వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
15.దూళిపాల మేధా దక్షిణామూర్తి, S/o. అగ్ని హోత్రులు, డోర్ నెం.10-1-46, సూర్యనారాయణ మూర్తి గుడి వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
16.సంకు శ్రీను, S/o.అబ్బులు, డోర్ నెం.C-101 బ్లాక్, L&T కాలనీ, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
17.డోరా ప్రసాద్, S/o.అబద్ధరావు, డోర్ నెం.51-5-20, రత్నశ్రీ హాస్పిటల్ వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
18.దేవరపు సూర్యనారాయణ, S/o.సత్యనారాయణ, డోర్ నెం.25-6-14/A, శంభుని చెరువు, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
19.యర్రంశెట్టి సురేష్ కుమార్, S/o. కృష్ణారావు, సూర్య ఫైనాన్స్, మసీదు వద్ద, మెయిన్ రోడ్, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
20.కాగిత అశోక్, S/o.సీతారామస్వామి, డోర్ నెం.2-49, బల్లిపాడు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
21.కాగిత ఏసురాజు, S/o.సీతారామస్వామి, డోర్ నెం.2-49, బల్లిపాడు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
22.కాగిత శ్రీనివాస రావు, S/o. సీతారామస్వామి, డోర్ నెం.2-49, బల్లిపాడు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
23.జుత్తిగ పద్మాజీ శ్రీనివాసరావు, S/o. సత్యనారాయణ, డోర్ నెం.1-127, శివదేవుని చిక్కాల, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
24.పాలంకి వీర వెంకట నాగ ముత్యం, S/o. సూర్యారావు, డోర్ నెం.2-73, వరిధనం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
25.నల్లమిల్లి గంగిరెడ్డి, S/o.లక్ష్మీనారాయణ, ఫ్లాట్ నెం.405, కాకినాడ, కాకినాడ జిల్లా.
26.The Official Receiver, ప.గో.జిల్లా., ఏలూరు. ...రెస్పాండెంట్స్
పై నెంబరు కేసులో పిటీషనర్స్ బాకీలు చెల్లించలేని స్థితిలో పై కోర్టులో పిటీషనర్స్ ని దివాలా కోరుదారుగా (Insolvents) ప్రకటించమని పిటీషన్ వేసినందున కోర్టు వారు ది.15-10-2024 సం.రం. తేదీనకు వాయిదా వేసియున్నారు. కావున రెస్పాండెంట్స్ కు మరియు ఎవరికైనా పై నెంబరు పిటీషనులో అభ్యంతరములు ఉన్నయెడలది.15-10-2024 సం.రం. తేదీన ఉదయం 10.30 ని.లకు స్వయంగా గాని, మీ ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.
(BY Order) వలవల సత్యనారాయణ మూర్తి, M.A., B.Ed., L.L.B., న్యాయవాది, పాలకొల్లు
తేదీ:29-09-2024 సెల్:9849038805